పల్నాడును సస్యశ్యామలం చేస్తాం

- రూ. 159 కోట్లు నిధులు తెస్తే ఎమ్మెల్యే ఒక్క పని చేయలేదు
- కూటమి అధికారంలోకి రాగానే అన్ని సమస్యలకు పరిష్కారం
- నర్సరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కృష్ణదేవరాయలు

6లో..



కర్నూలు జాతీయ రహదారిపైనే వాహనాలకు మరమ్మతులు

ఉత్తిత్తి.. హామీలు

- మాటలు.. చేతలంతా జగన్నాటకమే
- అతీగతిలేని ముఖ్యమంత్రి జగన్ హామీలు
- రెండేళ్ల క్రితం నరసరావుపేటలో ఆటోనగర్‌కు హామీ
- కోడ్‌కు ముందు హడావిడి శంకుస్థాపనతో సరి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

హామీలన్నీ వంద శాతం అమలు చేశామంటూ వైసీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. హామీల అమలు ప్రచారాలకే పరిమితమయ్యాయన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి హోదాలో జగన్ నరసరావు పేటకు వచ్చిన సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదు. దీంతో ఆయన మాటలు.. చేతలన్నీ ఓ జగన్నాటకమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆయనవి ఉత్తిత్తి హామీ లేనని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.

ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహనరెడ్డి ఏప్రిల్ 7, 2022న నరసరావుపేటకు వచ్చారు. ఆ రోజు జరిగిన వలంటీర్ల సత్కార సభలో ముఖ్యమంత్రి పలు వరాలు ప్రకటించారు. వీటిలో ఏ ఒక్కటీ ఇంతవరకు పూర్తి చేయలేదు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గానికి అవసరమైన ప్రతిపాదనలను సీఎం వద్ద ఉంచారు. దీనిపై స్పందించిన సీఎం మూడు దశాబ్దాలుగా రవాణారంగ కార్మికులకు తీరని కలగా ఉన్న ఆటోనగర్‌ను మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఇది నేటికి కార్యరూపం దాల్చ లేదు. ఎన్నికల కోడ్ ప్రకటనకు ముందుగా హడావుడిగా ఆటోనగర్ నిర్మిస్తున్నామంటూ ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దీనికి సంబంధించి పనులు ప్రారంభం కాలేదు. కార్మికులను మోసం చేసేందుకే శంకు స్థాపన స్టంట్ అన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి. ఆటోనగర్ కోసం నరసరావుపేట మోటార్ వర్కర్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీని కూడా మేస్త్రీలు, కార్మికులు ఏర్పాటు చేసుకు న్నారు. ఆటోనగర్ కోసం రూ.7 లక్షలను సొసైటీ ప్రతినిధులు ఏపీ పరిశ్రమల మౌళిక వసతుల కల్పన సంస్థకు డిపాజిట్ కూడా చేశారు. సీఎం జగన్ హామీ ఇవ్వడంతో ఆటోనగర్ కల సాకారం అవుతుందని కార్మి కులు ఆశపడ్డారు. ముఖ్యమంత్రి హామీ అమ లు కాకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జాతీయ రహ దారి, గుంటూరు, చిలకలూరిపేట రహదారుల మార్జిన్లలో వాహనాల మరమ్మతులు నిర్వ హించుకుంటూ కార్మికులు జీవనం సాగిస్తున్నారు.

- ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో భాగంగా మల్లమ్మ సెంటర్ నుంచి గడియార స్తంభం వరకు ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. నిర్మాణం మాట ఎలా ఉన్నా ఇందుకు సంబంధించి సర్వే కూడా చేయలేదు. నరసరావుపేట జిల్లా కేంద్రం అయినా కూడా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరలేదు. అస్తవ్యస్త ట్రాఫిక్‌తో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడియార స్తంభం సెంటర్ నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయని ప్రజలు భావించారు. అయితే నేటికి దీని నిర్మాణంపై ఎటువంటి చర్యలు లేవు.
- నియోజకవర్గానికి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ను మంజూరు చేసినట్లు జ గన్ ప్రకటించారు. రెండేళ్లు గడిచినా ఈ కళాశాల ఊసే లేదు.



నరసరావుపేట పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు

కల్యాణం కమనీయం

- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు
- రామనామస్మరణలతో తరించిన భక్తజనం

నరసరావుపేట, ఏప్రిల్ 17: శ్రీరా మనవమి వేడుకలు వాడవాడలా బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా రామ నామస్మరణలతో తరించారు. జిల్లాలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణాలు, పల్లెల్లో జరిగిన శ్రీసీతారాముల కల్యాణోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించి పులకించి పోయారు. వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నరసరావపేటలోని పట్టాభిరా మస్వామి దేవాలయంలో సీతారాము లు కల్యా ణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా దంపతులు, సత్తెనపల్లి రోడ్డు లోని సీతారామచంద్ర దేవాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రామిరెడ్డిపేటలోని శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన కల్యా ణోత్సవంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పాల్గొన్నారు.

పట్టాభిరామ స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు







అమరావతిని నాశనం చేశారు

- ఉన్మాది అధికారంలోకి వస్తే ఇదే జరుగుతుంది
- టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- కూటమి నేతలతో కలసి రాజధానిలో పర్యటన



దుండగులు ధ్వంసం చేసిన అమరావతి గ్యాలరీని పరిశీలిస్తున్న పెమ్మసాని

తుళ్లూరు, మార్చి 17: ఒక ఉన్మాది అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో అమరావతి రాజధానే ఉదాహరణ అని గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన రాజధాని అమరావతిలో పర్యటించారు. తొలుత ప్రధాని శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయునిపాలెంలో ధ్వంసం చేసిన అమరావతి నమూనా గ్యాలరీ పరిశీలించారు. పవిత్రమైన నీరు మట్టి నిక్షిప్తం చేసిన ప్రదేశంలో ప్రదక్షణ చేసి కొబ్బరి కాయ కొట్టారు. అనంతరం టీడీపీ ప్రభుత్వంలో కట్టిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలను పరిశీలించారు. ఆ తరువాత పర్మినెంట్ అసెంబ్లీ, సచివాలయం భవనాల కోసం వేసిన పౌండేషన్‌లు నీళ్లలో ఉండటం, ఐరన్ తుప్పు పట్టటాన్ని రైతులు పెమ్మసానికి చూపించారు. దీంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాఖమూరు లో అంబేద్కర్ స్మృతి సందర్శించి విలేకరులతో పెమ్మసాని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్మాణ కంపెనీలను తరిమేసి అమరావతిని అడవిని చేశారన్నారు. ఇక్కడ ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని జగన్మోహన్ రెడ్డి అబద్దాలు చెప్పారన్నారు. ఐదేళ్లలో ఓ ఒక్కటీ నిరూపించలేక పోయారన్నారు. 125 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు మౌలిక వసతులు కల్పించకుండా అడ్డుకున్నాడన్నారు. పది లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అమరావతిని నిర్వీర్యం చేశాడన్నారు. రాజధానిలో



ఐదు వేల టిడ్కో గృహాలు వృథాగా వదిలేశాడన్నారు. గత ప్రభుత్వం రాజధాని అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను జగన్ ధ్వంసం చేశాడన్నారు. ఆర్ -5 జోన్ పేరిట అభివృద్ధి కారిడార్ ప్రాంతాన్ని విధ్వంసం చేశాడన్నారు. బయట ప్రాంతాల వారికి ఇంటి స్థలం ఇక్కడ ఇచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూశాడన్నారు. అమరావతిలో ఒకే వర్గం వారికి భూములున్నాయని తప్పుడు ప్రచారం చేశాడన్నారు. 20వేల మంది చిన్న సన్నకారు రైతులు భూములిచ్చారని తెలిపారు. 70 బహుళ అంతస్తుల భవనాలను సీఎం జగన్ రెడ్డి గాలికి వదిలేశాడన్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదన్నారు. నిర్మాణాలు జరుగుతుంటే లక్ష మందికి పని దొరికేదన్నారు. అంబేద్కర్ స్మృతి వనం కోసం ఉద్దేశించిన ప్రాంతాన్ని నాశనం చేశారన్నారు. దీన్ని కూడా రాజకీయం చేసి వేరే చోట అంబేద్కర్ విగ్రహం పెట్టారన్నారు. రాజధానిలో జరిగిన విధ్వంసం చూస్తుంటే చాలా ఆవేదన కలుగుతుందని పెమ్మసాని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రాజధాని కోసం ఖర్చు చేసిన పదివేల కోట్ల రూపాయలు వృథా అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అమరావతిలో హృదయ విదారకరమైన పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు, దళిత, మైనార్టీ, మహిళా జేఏసీ నేతలు, సభ్యులు, టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరావతిలో తవ్వేసిన రోడ్డును పరిశీలిస్తున్న పెమ్మసాని , రైతు జేఏసీ నేతలు



రాజధానిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు జేఏసీ నేతలతో పెమ్మసాని చంద్రశేఖర్

పల్నాడును సస్యశ్యామలం చేస్తాం

- రూ. 159 కోట్లు నిధులు తెస్తే ఎమ్మెల్యే ఒక్క పని చేయలేదు
- కూటమి అధికారంలోకి రాగానే అన్ని సమస్యలకు పరిష్కారం
- నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు
- బొల్లాకు రాజకీయ సమాధి ఖాయం : జీవీ



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణదేవరాయలు

శావల్యాపురం, ఏప్రిల్ 17: ఉమ్మడి కూటమి అధికారంలోకి రాగానే గోదావరి జలాలను తెచ్చి సాగర్ కుడికాలువకు కలిపి పల్నాడు జిల్లాను పాడిపంటలతో సస్యశ్యామలం చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శావల్యాపురం మండలంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో గోదావరి జలాలను నకరికల్లు వద్ద సాగర్ కుడికాలువకు కలిపేందుకు అనుమతులు తెచ్చి పనులు ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వం దాన్ని నిలిపివేసిందని, కూటమి అధికారంలోకి రాగానే పనులను పునఃప్రారంభించి పల్నాడు జిల్లాలోని రైతులందరికీ రెండు పంటలకు సాగు నీరందిస్తామన్నారు. వినుకొండలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జీవీ రూ.159 కోట్లు నిధులు తెస్తే ఎమ్మెల్యే బొల్లాకు చేతకాక నిలిపివేశారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణను పూర్తి చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కార్పోరేషన్‌ల ద్వారా రాయితీ రుణాలిచ్చి వారిని ఆదుకొంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ కాలనీలు ఏర్పాటు చేసి ప్రతి పేదవానికి రెండు సెంట్లు స్థలాన్నిచ్చి ఇళ్ళు కట్టిస్తామన్నారు. 50 ఏళ్ళు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 4వేలు చొప్పున పింఛన్‌ను అందిస్తామన్నారు. ఎమ్మెల్యే బొల్లా దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. బొల్లాను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి రాజకీయ సమాధి కట్టడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా వినుకొండను పూర్తిగా కబ్జా చేశాడని, వినుకొండ అభివృద్ధిలో ఆయన పాత్రేమీ లేదన్నారు.



లావు, జీవీలకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

శావల్యాపురం మండలంలో విశేష ఆదరణ

శావల్యాపురం, శానంపూడి, బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు బుధవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ప్రచారంలో పాల్గొన్నారు. శావల్యాపురంలోని ఎస్టీకాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీని ఏర్పాటు చేయాలని, రైల్వేలైన్ అభివృద్ధి పనుల్లో పూడిపోయిన పంటకాలువను పునరుద్ధరించి 400 ఎకరాలకు సాగునీరు అందేలా చూడాలని స్థానికులు కోరగా అధికారంలోకి రాగానే అన్నింటినీ పూర్తి చేస్తామని నేతలు హామీనిచ్చారు. శానంపూడిలో ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చివరిగా మతుకుమల్లికి చేరుకొని గ్రామంలో ప్రచారాన్ని నిర్వహించారు. మతుకుమల్లిలో స్థానికులు పలు సమస్యలను ప్రస్తావించగా అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. శావల్యాపురంలో టీడీపీలోకి చేరిన మద్దినేని అనిల్, శానంపూడిలో టీడీపీలోకి చేరిన రేషన్ డీలర్ వంకాయలపాటి సూర్యనారాయణ, మతుకుమల్లిలో టీడీపీలోకి చేరిన మందా విజయరాజు, గుంజరి పోలేశ్వరరావు, మందా శ్యాంసన్ తదితరులకు నేతలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు, జనసేన వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీనురాయల్, టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, జనసేన మండలాధ్యక్షులు అడపాల అనిల్‌కుమార్, టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, బొల్లా పేరయ్య, గోరంట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, చింతా గంగయ్య, ఒత్తుల వెంకటేశ్వర్లు, అమృతపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

కమనీయం.. సీతారాముల కల్యాణం

- వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- కల్యాణాన్ని తిలకించిన నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 17: సీతారాముల కల్యాణ వేడుకలతో భక్తకోటి పులకించింది. శ్రీరామ నవమి ఉత్సవాలను బుధవారం వాడవాడలా అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పానకం, వడపప్పు తీర్థ ప్రసాదాలుగా పంపిణీచేశారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరవపటాలం వద్ద వున్న రామాలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరయ్యారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కష్టకాలంలో మనమందరం ఎలావుండాలో శ్రీరాముడు చూపించారని, ఆ మహనీయుని వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటే ఎలాంటి కష్టాలనుంచైనా బయట పడవచ్చని ఈ సందర్భంగా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో రామరాజ్యం ఏర్పడి ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. లోకేశ్ వెంట టీడీపీ నియోజక వర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, కూటమి నేతలు తమ్మిశెట్టి జానకీదేవి, దామర్ల రాజు, జగ్గారపు శ్రీనివాసరావు, మునగపాటి మారుతీరావు, గోవాడ దుర్గారావు, మునగపాటి వెంకటేశ్వరరావు, తోట పార్థసారధి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నారా లోకేశ్



సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

తదితరులు వున్నారు. అనంతరం జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏపీఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఐజీ-2 వెంకటేశ్వర్లు, ఆరవ పటాలం కమాండెంట్ వి.రత్నం, అడిషనల్ కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పాతమంగళ గిరి సీతారామ స్వామి కోవెల, డాక్టర్ ఆంజనేయ కాలనీ, మెయిన్ బజారులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ లక్ష్మీ గణపతి కోదండ రామాలయం, భార్గవపేటలోని సీతారామ నామక్షేత్రం, గోలిలింగయ్య రామమందిరం, కుప్పురావు కాలనీ, శ్రీలక్ష్మీనరసింహ స్వామి కాలనీల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది.

ప్రత్యేక రైళ్లకు గుంటూరు డివిజన్‌లో హాల్టింగ్‌లు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి జూన్ 27 మధ్యన గుంటూరు మీదగా ప్రయాణించనున్న నెంబరు. 02863 హౌరా - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలుకు గుంటూరు డివిజన్‌లో హాల్టింగ్‌లను కల్పిస్తూ రైల్వే శాఖ నోటీఫై చేసింది. ఈ రైలు గుంటూరుకు శుక్రవారం ఉదయం 8.20కి, నరసరావుపేటకు 9.05కి, మార్కాపురం రోడ్డుకు 10.35కి, గిద్దలూరుకు 11.35కి చేరుతుంది. అలానే నెంబరు. 02864 యశ్వంత్‌పూర్ - హౌరా వీక్లీ రైలు ఈ నెల 20 నుంచి జూన్ 29వ తేదీ మధ్యన ప్రతీ శనివారం బయలుదేరుతుంది. ఈ రైలు శనివారం మధ్యాహ్నం 1.19కి గిద్దలూరు, 2.10కి మార్కాపురం రోడ్డు, 3.29కి నరసరావుపేట, సాయంత్రం 5.25కి గుంటూరు చేరుకొంటుంది. అలానే నెంబరు. 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ రైలు ఆదివారం ఉదయం 8.35కి గుంటూరు, 9.20కి నరసరావుపేట, 11.20కి మార్కాపురం రోడ్డు, 12.20కి గిద్దలూరు చేరుకొంటుంది. నెంబరు. 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ రైలు ప్రతీ సోమవారం సాయంత్రం 4.05కి గిద్దలూరు, 5.04కి మార్కాపురం రోడ్డు, 6.29కి నరసరావుపేట, రాత్రి 7.20కి గుంటూరు చేరుకొంటుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	132, 141,152
చికెన్ విత్ స్కిన్	252.00
చికెన్ స్కిన్ లెస్	262.00



జగన్ పత్రికపై ఎస్ఐ భార్గవ్‌కు ఫిర్యాదు చేస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

జగన్ పత్రిక అసత్యపు వార్తలపై
క్రిమినల్ కేసు నమోదుచేయాలి

- ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఏప్రిల్17: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుటుంబానికి చెందిన దినపత్రికలో తనపై అవాస్తవాలు, అభూత కల్పనలు, అసత్యాలతో రాసిన కథనంపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన నరేంద్రకుమార్ ఎస్ఐ బీ.భార్గవ్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు అందచేశారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ పత్రికలో గతంలోనూ తనపై అసత్య కథనాలు ప్రచురిస్తే కోర్టు నోటీసులు అందచేసినట్లు చెప్పారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పది నెలల కాలంలో తనపై ఆరోపణలు ఎందుకు నిరూపించలేకపోయ్యారని ప్రశ్నించారు. భూకబ్జాలు చేశానని, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించానని, దేవాదాయ శాఖ భూములు ఆక్రమించానని చేసిన ఆరోపణల్లో ఒక్కటి కూడా నిరూపించలేదని ధ్వజమెత్తారు. వైసీపీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఐదేళ్ల కాలంలో చేసిన అక్రమాలు, అవినీతిపై ప్రజా చార్జ్ షీట్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఆయిన అవినీతిపై ఒక కథనం అయినా సాక్షిలో ప్రచురించారా అని ప్రశ్నించారు. మంత్రులు అంబటి రాంబాబు వంటి వారు చేస్తున్న దురాగతాలు గురించి సాక్షిలో ఎందుకు ప్రచురించటం లేదని భారతీ రెడ్డిని నిలదీసారు. తనపై దుష్ప్రచారాలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన కింద వస్తాయని అన్నారు. భారతీరెడ్డి నుంచి ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరినట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి తాకిడికి
వృద్ధురాలి మృతి

వినుకొండ,ఏప్రిల్ 17: వేసవి తాకిడిని తట్టుకోలేక ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం చోటుచేసుకుంది. డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండ పట్టణంలోని ఓబయ్యకాలనికి చెందిన కాకర్ల అంజమ్మ అనే వృద్ధురాలు నాలుగు రోజులుగా వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తుందన్నారు. విజయవాడ ఆర్టీసీ బస్సు పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కుర్చీలపై ఆమె మృతి చెంది ఉండడాన్ని ప్రయాణికులు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. వెంటనే తాము పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



పల్నాడు వార్తలు

నామినేషన్ దాఖలుకు నిబంధనలు

● కేంద్రానికి 100 మీటర్ల దూరంలో వాహనాలు ఉండాలి

● జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ వెల్లడి



జేసీ శ్యాం ప్రసాద్

రెంటచింతల,ఏప్రిల్ 17 : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని పల్నాడుజిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల రిటరి ్నంగ్ ఆఫీసర్ శ్యాం ప్రసాద్ కోరారు. బుధవారం ఆయన రెంటచింతలలో విలేకరులతో మాట్లా డుతూ.. గురువారం నుంచి నామినేషన్లను స్వీకరిం చనున్న తరణంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు అభ్యర్థులు వారి నామినేషన్లను మాచర్ల ఆర్వో కార్యాలయంలో దాఖలు చేయవచ్చన్నారు. నామినేషన్‌కు ర్యాలీగా వచ్చే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, సాధారణంగా వచ్చే వారికి ఈ నిబంధన వర్తించదని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు చేసే వారు మూడు వాహనాల్లో రావాలని, ఆ వాహనాలను కేంద్రా నికి 100 మీటర్ల దూరంలో ఉంచాలన్నారు. నామినేషన్ హాల్లోకి అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సెలవు దినాల్లో నామినే షన్ల స్వీకారం ఉండదన్నారు. 26వ తేదిన నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని, మే 13న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ రుసుం నగదు రూపంలో చెల్లించే అవకాశం వుందన్నారు. అభ్యర్థి వారి తరుపున ఏజెంట్ బ్యాంక్‌లో నూతన ఖాతా ప్రారంభించి పోలింగ్ లో వ్యయాలకు సంబంధించి బిల్లులను ఓట్ల లెక్కింపు పూర్తయిన నెల రోజుల లోపు అందించాలన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు 12డీ ఫారం అందచేసే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఎంసీసీ ఆఫీసర్ శంకరరావు పాల్గొన్నారు.



టీ కప్పుల పై అంబటి రాంబాబు చిత్రం, ఫ్యాన్ గుర్తు ముద్రించిన దృశ్యం

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు

● వైసీపీ అభ్యర్థుల ఫోటోలతో టీ గ్లాసుల పంపిణీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 17 : పట్టణంలోని వైసీపీ నాయకులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంగణలకు పాల్పడుతున్నారు. వైసీపీ అభ్యర్థులు అంబటి రాంబాబు అనీల్ కుమార్‌యాదవ్, ఫ్యాన్ గుర్తులతో కూడిన చిత్రాలు ముద్రించిన టీ కప్పులను పట్టణంలోని టీస్టాల్స్‌లో పంపిణీ చేస్తున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆ టీ కప్పులపై ముద్రించి ఉంది. ఒక్కో టీస్టాల్‌కు 200 కప్పులను వైసీపీ నేతలు పంపిణీ చేశారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నేతలు తెలిపారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తా ..

అంబటి రాంబాబు, అనీల్ కుమార్ యాదవ్‌ల ఫోటో, ఫ్యాన్ గుర్తులను టీ కప్పులపై ముద్రించి పట్టణంలో వైసీపీ నాయకులు పంపిణీ చేయటంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని జై భీమ్ భారత్ పార్టీ సత్తెనపల్లి అభ్యర్థి జొన్నలగడ్డ విజయకుమార్ విలేకరులకు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు వైసీపీ అభ్యర్థులు రాంబాబు, అనీల్ కుమార్ యాదవ్‌లు వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

అభివృద్ధి జరలేదనడం అవాస్తవం

రెంటచింతల,ఏప్రిల్ 17 : మాచర్ల నియోజకవర్గంలోని 77 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమం జరగలేదని ప్రతిపక్షాలు పేర్కొనడం సమంజసం కాదని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అన్నారు. బుధవారం పశర్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ. 1796 కోట్ల సంక్షేమ కార్యక్రమాలు, రూ.1495 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రూ.450 కోట్ల సీసీ రోడ్లు, హైవేల నిర్మాణం జరిగిందని చెబుతూ బైపాస్ రోడ్డు, ఆర్‌బీకేలు నిర్మాణం పూర్తి చేశామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, జిల్లా జేసీఎస్ చైర్మన్ మోర్తల ఉమ,ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి,వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి,చల్లా మట్టారెడ్డి,మాజీ జడ్పీటీసీ ఎస్.భాస్కరరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఏడుకొండలు పాల్గొన్నారు.

20న టీడీపీ మాదిగల ఆత్మీయ సమ్మేళనం

సత్తెనపల్లి, ఏప్రిల్ 17: సత్తెనపల్లిలోని టీడీపీ ప్రజావేదికలో ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఈనెల 20న సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ మాదిగల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ తెలిపారు. బుధవారం ఆయన సత్తెనపల్లిలో టీడీపీ మాదిగ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ద్వారానే మాదిగలకు మేలు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ఎమ్మార్పీఎస్ పని చేస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంకాళ్ళ ప్రభుదాసు, బొక్కా సంగీతరావు, బండారు నాగరాజు, సత్యం, శనగపూల నరసింహారావు, కాంతారావు, చిలకకా చంటి, జంగాల శ్రీనివాసరావు, వెంకయ్య, బండారు ఏలియా తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు సాగర్ జలాలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 17 : పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను మునిసిపల్ కమిషనర్ షమ్మి ఆధ్వర్యంలో మునిసిపల్ సిబ్బంది ఆయిల్ ఇంజన్‌ల ద్వారా నీటితో నింపుతున్నారు. పూర్తిస్థాయిలో ట్యాంకులను నింపేందుకు కృషి చేస్తున్నారు. పట్టణంలో వేసవి తాగు నీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకులను నింపాలని సీపీఎం నాయకులు ఈ సందర్భంగా అధికారులను కలిసి విన్నవించారు. అనంతరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను వారు పరిశీలించారు. కాలువ ద్వారా నీటిని స్టోరేజ్ ట్యాంకులో నింపేందుకు అదనంగా గడువు పొడిగించాలని సీపీఎం నాయకులు గద్దె చలమయ్య, ధరణికోట విమల, అవ్వారు ప్రసాదరావు, శివ దుర్గారావు తదితరులు కోరారు.

రౌడీలు, దోపిడీదారులు రాజ్యమేలుతున్నారు

● కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

● నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

● వివిధ ప్రాంతాల్లో టీడీపీలోకి భారీగా చేరికలు



పాలువాయి బ్రహ్మారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బ్రహ్మారెడ్డి

దుర్గి, ఏప్రిల్ 17: మాచర్ల నియోజకవర్గంలో రౌడీలు, దోపిడీదారులు రాజ్యమేలుతున్నారని, వారి ఆటలు సాగనివ్వనని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని పోలేపల్లెలో మంగళవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు, భారీ గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఓటమి భయంతోనే పిన్నెల్లి సోదరులు టీడీపీ నేతలపై వరుస దాడులు చేస్తున్నారన్నారు. భయపడితే భయపెట్టే రోజులు పోయామని, నియోజకవర్గ ప్రజలకు జూలకంటి కుటుంబం అండగా ఉంటుందని గుర్తు పెట్టుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ప్రభుత్వ భూములు, ఆస్తులను దోచుకోవడంతోపాటు చెరువుల్లో మట్టిని కూడా వదల్లేదన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ గుండాలకు బుద్ధి చెప్పే రోజులు మరెన్నో రోజులు లేవని, దాడులు నిలుపకపోతే రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

టీడీపీలో చేరిన సొసైటీ మాజీ చైర్మన్ బ్రహ్మారెడ్డి

మండలంలోని పోలేపల్లికి చెందిన మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ చైర్మన్ పాలువాయి బ్రహ్మారెడ్డితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన 60కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బ్రహ్మారెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వంగులూరి అంజయ్య, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మేకల దాసు, జానకి రామయ్య, జనసేన మండల అధ్యక్షుడు తోటకూర శ్రీను, పసుమర్తి బుజ్జి, సింగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్: పార్టీలోని కార్యకర్తలందరికీ అండగా ఉంటానని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దేశవరం క్యాంపు తండాకు చెందిన 12 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామియాదవ్, జనసేన మండల అధ్యక్షుడు గుండెబోయిన సాంబశివరావు, బొల్లా వెంకటేశ్వర్లుచౌదరి, రామ్‌చంద్‌నాయక్, సైదారావు, ఘంటా ధనుంజయరావు, కట్టా రాజు తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో ప్రచారం.. ముస్లిం, మైనార్టీలు మేలు చేసింది టీడీపీనే అని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 27వ వార్డు జెండాచెట్టు బజారులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు శ్రీకృష్ణదేవరాయలు, జూలకంటి బ్రహ్మారెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మదార్‌సాహెబ్, వలి, సుభాని, జానీబాషా, మైనా, అన్వర్‌బాషా, బాబుఖాన్, నాగూర్‌బాషా, సైఫుల్లా, జబ్బార్, భద్రుసాహెబ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

వెల్దుర్తి: గిరిజన తండాలు, గూడెంల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని మరసపెంట, జెండాపెంట గూడెంలలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా చేసి మౌలిక వసతులు సమకూర్చడంతో పాటు అభివృద్ధి పథంలో నడిపించిన చంద్రబాబుకు మద్దతు తెలపాలని కోరారు. ప్రతి తండాలో సీసీ రోడ్లు, మౌలిక వసతులు టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినవే తప్ప వైసీపీలో చేసిందేమీ లేదన్నారు. గిరిజనుల బిడ్డలకు ఉన్నత విద్య అందకుండా అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని నిలిపివేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. గిరిజన రైతులకు సంక్షేమ పథకాలను తీసివేసిన ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామానికి చేరుకున్న బ్రహ్మారెడ్డికి మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ధారునాయక్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సెబ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

మద్య రహిత ఎన్నికలే ధ్యేయం

● జిల్లా సెబ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

క్రోసూరు, ఏప్రిల్ 17: మద్య రహిత ఎన్నికలే ఎక్సైజ్ శాఖ ధ్యేయమని పల్నాడుజిల్లా సెబ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ అన్నారు. బుధవారం క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే అచ్చంపేట మండలం మాదిపాడు జగనన్న కాలనీలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మద్యానికి సంబంధించి అక్రమాలు ఎక్కడ చోటుచేసుకున్నా వెంటనే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఈ విషయంలో తమకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ముఖ్యంగా తెలంగాణా మద్యం అక్రమ రవాణా, అనధికార మద్యం విక్రయాలు, బెల్టు షాపుల నిర్వాహణ, నాటు సారా తయారీ తదితర అంశాల పై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కు పాదం మోపనున్నట్టు తెలియ జేశారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి మద్యంపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. చెక్ పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేసినట్టు తెలియ జేశారు. పాత నేరస్తుల కదికలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మద్యం తరలింపు చేసేవారిని పట్టుకునే విషయంలో అధికారులు, సిబ్బంది పార్టీలకతీతంగా వ్యవహరించా లని ఆదేశించారు. ఈ విషయంలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసుశాఖతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు ఎక్సైజ్ కార్యకలాపాలను పటిష్ఠంగా అమలు చేస్తామన్నారు. సమావేశంలో ఆయనతో పాటు క్రోసూరు ఎక్సైజ్ సీఐ, ఇతర అధికారులు ఉన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

దుర్గి, ఏప్రిల్ 17: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నరసరావుపేట నుంచి వచ్చిన 40 మంది బృందం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరు పలు బృందాలుగా విడిపోయి గ్రామాల్లో పర్యటించి కూటమి నరసరావుపేట అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల అభ్యర్థి బ్రహ్మారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఓర్సు కోటేశ్వరరావు, ఉన్నం మహేష్, రామలక్ష్మయ్య, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

25న ఏపీఆర్‌డీసీలో ప్రవేశ పరీక్ష

విజయపురిసౌత్, ఏప్రిల్ 17: స్థానిక ఏపీఆర్‌డీసీలో ప్రవేశానికి ఈనెల 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో 25న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లను వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.



అగ్ని ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సత్తెనపల్లి, ఏప్రిల్ 17 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు ఆధ్వర్యంలో పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డెమో ద్వారా వివరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో రాజశేఖర్, శ్రీనివాసరావు, గౌస్, హుస్సేన్, సుభానీ, మహేందర్‌రెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



మాదిపాడులో పట్టుకున్న అక్రమ మద్యాన్ని తెలియ జేస్తున్న ఎస్ఈబీ అధికారులు

రూ 4.50 లక్షల విలువైన

తెలంగాణా మద్యం స్వాధీనం

అచ్చంపేట, ఏప్రిల్ 17 : మండలంలోని మాదిపాడు పరిధిలో గల జగనన్న కాలనీలో బుధవారం తెలంగాణా మద్యాన్ని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు సెబ్ అధికారులు దాడులు నిర్వహించి 72 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకోగా మొత్తం 3,456 మద్యం బాటిల్స్, వాటి విలువ సుమారు రూ 4.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మద్యానికి సంబంధించి మాదిపాడు గ్రామానికి చెందిన ఎస్‌కే అబ్దుల్ సత్తార్‌ను అధికారులు అరెస్టు చేశారు. సద్దాం హుస్సేన్ అనే వ్యక్తి హస్తం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఈ దాడుల్లో పల్నాడు జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు నరసరావుపేట ఎస్ఈబీ అధికారి సూపరింటెండెంట్ ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, క్రోసూరు సెబ్ అధికార అశోక్ కుమార్ పాల్గొన్నారు.

దళిత ద్రోహులకు ఆశ్రయమిస్తున్న సీఎం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 17 : దళితులను అవమానించిన వారికి సీఎం జగన్‌రెడ్డి ఆశ్రయం ఇస్తున్నారని, దీంతో వైసీపీ దళిత ద్రోహుల పార్టీ అని రుజువు అయిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దళితులకు శిరోమండనం చేసిన కేసులో జైలు శిక్ష పడిన తోట త్రిమూర్తులు అనే వ్యక్తికి ఆశ్రయం ఇవ్వడంతో పాటు పదవిని కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ప్రతి వేదికపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని ప్రేమ వలకబోస్తున్నారని, ఇప్పుడు కోర్టు ఇచ్చిన తీర్పుకి ఏం సమాధానం చెబుతావని సీఎం జగన్‌రెడ్డిని ప్రశ్నించారు. నాడు దళితుడిని చంపిన అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసి మళ్ళీ పార్టీలోకి తెచ్చుకున్నాడన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలోనే దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయని, ఎస్సీలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్ నుంచి దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతో మంది దళిత బిడ్డలు బలయ్యారన్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యామ్‌కుమార్‌ను నిర్బంధించి నాలుగు గంటలపాటు చిత్రహింసలు పెట్టారన్నారు. దాహం వేసి మంచినీళ్ళు అడిగితే సభ్యసమాజం తలదించుకొనేలా మూత్రం పోసి అవమానించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఏమాత్రం మనస్సాక్షి ఉన్నా ఈ అమానవీయ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత దళితులకు న్యాయం చేసేందుకు ఏర్పాటైన చట్టబద్ధ సంస్థకు అధిపతి అయిన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌బాబు ఈ ప్రభుత్వంలో 'నేనే బాధితుడిని' ప్రకటించారని వాపోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి జమానాలో దళితులపై అణచివేత, దుశ్చర్యలకు ఇంతకుమించిన పరాకాష్ట మరొకటి ఉండదన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 6035 మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం దళితులపై దాడులు జరుగుతున్న రాష్ట్రాలలో ఏపీ 7వ స్థానంలో ఉందన్నారు. 2021 లో 208 మంది ఎస్సీ మహిళలు, చిన్నారులపై దాడులు జరిగాయని, 33మంది దళితులు హత్యకుగురయ్యారన్నారు. నంద్యాల జిల్లా మునగాల సుంకులమ్మ ఆలయంలోకి వెళ్ళకుండా అవమానించి, అడ్డుకు న్నారని మల్లెపోగు నరహరి అనే దళిత యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ జంబులయ్య, మరికొందరుకాలితో తన్ని ఆలయంలోకి వస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారన్నారు. దళిత అంగన్‌వాడీ కార్యకర్తను శారీరకంగా, మాటలతో వేధించిన కొత్తపల్లి ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ర్యాలీ చేపట్టినా ప్రయోజనం లేపోయిందన్నారు.

దళిత ద్రోహులకు ఆశ్రయమిస్తున్న జగన్

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 17 : రాష్ట్రంలో దళిత ద్రోహులకు వైఎస్ జగన్‌రెడ్డి ఆశ్రయమిస్తున్నాడని సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళితులను అవమానించిన వారికి జగన్ ఆదరించి, ఆశ్రయమిస్తూ అందలమెక్కిస్తున్నాడని ఆరోపించారు. దీంతో వైసీపీ దళిత ద్రోహుల పార్టీ అని మరోసారి స్పష్టంగా రుజువైందన్నారు. మండపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోట త్రిమూర్తులుకు వైసీపీ ఆశ్రయమిచ్చిందన్నారు. దళితులకు శిరోముండనం కేసులో ఆయనను కోర్టు దోషిగా తేల్చిందన్నారు. అలాగే దళితుడిని చంపిన అనంతబాబును పార్టీలోకి తెచ్చుకున్నారన్నారు. జగన్ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని, దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అలాగే దళితులపై దాడులకు పాల్పడిన వారికి పార్టీలో ప్రముఖ స్థానాన్ని కల్పిస్తాం దని దుయ్యబట్టారు. దళితులపై రాష్ట్రంలో రోజుకో దాడి జరుగుతుందన్నారు. దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కన్నా తెలిపారు.

కన్నుల పండువగా శ్రీరామనవమి

మాచర్లటౌన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మాచర్ల పట్టణంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యాన శోభాయాత్ర నిర్వహించారు. కోదండ రామాలయం వద్దనుంచి పార్కుసెంటర్ మీదుగా నెహ్రూనగర్ వరకు, అక్కడి నుంచి సాగర్ రింగురోడ్డు వరకు భారీ బైకు ర్యాలీ జరిపారు.

మాచర్ల రూరల్ : మాచర్ల పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చలువ పందిళ్లలో ఉత్సవవిగ్రహాలను ఆశీనులనుచేసి భక్తుల సమక్షంలో కల్యాణ ఘట్టం నిర్వహించారు. భక్తులకు పానం, వడపప్పు పంపిణీ చేశారు.

కారంపూడి: కారంపూడిలోని అంకాళమ్మ దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను కన్యకా పరమేశ్వరి ఆలయంనుంచి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి కల్యాణ ఘట్టం, ముత్యాల తలంబ్రాలు కార్యక్రమాలను నిర్వహించారు.

దుర్గి: వివిధ ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షించారు. భక్తులకు వడపప్పు, పానకం తీర్థ ప్రసాదాలుగా అందించారు.



శోభయాత్రలో ఎమ్మెల్సీ జంగా, యరపతినేని నిఖిల్ తదితరులు

రెంటచింతల: కృష్ణానది ఒడ్డున గల సత్రశాల ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బి.బ్రహ్మారెడ్డి, టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ వేంకటరమణ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని వివిధ ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. యరపతినేని నిఖిల్, మహేష్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలో భారీగా రథయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, యరపతినేని తనయుడు నిఖిల్, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, కనిగిరి శ్రీనుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

మాచవరం: మండలంలోని వేమవరం, మాచవరం, పిన్నెల్లి, చెన్నాయపాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల, మల్లవోలు, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేమవరంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సత్తెనపల్లి: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలుచేశారు. మండలంలోని ధూళిపాళ్లలో నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటప్పారావు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

నకరికల్లు: మండలంలోని వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. చల్లగుండ్లలోని ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అనం తరం గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.

సత్తెనపల్లిరూరల్ : మండలంలోని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు



సత్తెనపల్లిలో పూజలు చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. నందిగామలోని రామాలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

ముప్పాళ్ళ: మండలంలోని ముప్పాళ్ళ, దమ్మాలపాడు, ఇరుకుపాలెం, నార్నెపాడు, బొల్లవరం, మాదల గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, బలిజేపల్లి, కొండమోడు తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం పంపిణీచేశారు. బ్రహ్మణపల్లి, బలిజేపల్లి గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలోనూ, అన్ని గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు ప్రసాదం, పానకం పంపిణీ చేశారు.

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు, వివిధ గ్రామాల్లో సీతారామ కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆయా దేవాలయాల వద్ద భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

పెదకూరపాడు: పెదకూరపాడులోని మూడు రామాలయాలతో పాటు దళితవాడలోని రామాలయంలో పల్నాడు వీరాచారులు కత్తులతో సీతారామ స్వామి వారి స్తంభం ముందు సాధనచేశారు. అనంతరం సీతారాముల కళ్యాణం అనంతరం వడ పప్పు, పానకం పంపిణీ చేశారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి



మళ్లీ.. మళ్లీ గెలిచారు

- వరుస విజయాలు.. వారి సొంతం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోడెలదే రికార్డు
- ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక
- మిగిలిన ముగ్గురు ఐదుసార్లు..


డాక్టర్ కోడెల శివప్రసాదరావు


కన్నా లక్ష్మీనారాయణ


ధూళిపాళ్ల నరేంద్ర


డాక్టర్ మాకినేని పెదరత్తయ్య

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


ఎన్నికల రణక్షేత్రంలో వారికంటూ ఓ ప్రత్యేకత ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కువసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సృష్టించారు. వరుస విజయాలను వారు సొంతం చేసుకున్నారు. నవ్య ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరుసార్లు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య, ధూళి పాళ్ల నరేంద్ర వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి రికార్డు సృష్టించారు.

● డాక్టర్ కోడెల శివప్రసాదరావు తెలుగుదేశం ఆవిర్భావంతో ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్, కాసు కుటుంబ కంచుకోట నరసరావుపేటను బద్దలుకొట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యధికసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నేతగా కోడెల రికార్డు నెలకొల్పారు. 1983 ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేసి కోడెల విజయం సాధించారు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో కోడెల తన విజయ యాత్రను కొనసాగించారు. వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోడెల పలు మంత్రి పదవులను నిర్వహించారు. 2004, 2009 ఎన్నికల్లో నరసరావుపేట నుంచి పోటీ చేసి ఓటమిని చవిచూసిన కోడెల 2014 ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజక వర్గం నుంచి పోటీచేసి ఆరవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన కోడెల నవ్య ఆంధ్రప్రదేశ్‌కు తొలి స్పీకర్‌గా కోడెల పనిచేశారు. 2019 ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి తిరిగి పోటీ చేసిన కోడెల ఓటమి చెందారు. ఆయన 2019 సెప్టెంబర్ నెలలో మృతిచెందారు. మొత్తం తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన కోడెల ఆరుసార్లు విజయం సాధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసే అరుదైన అవకాశం ఒక్క కోడెలకు మాత్రమే దక్కింది. రెండు దశాబ్దాలపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాలను శాసించారు.

● మాజీ మంత్రి, సత్తెనపల్లి తెలుగుదేశం అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కూడా వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పెదకూరపాడు నియోజకవర్గం నుంచి కన్నా 1989, 1994, 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. వరుసగా ఐదోసారి విజయాన్ని సొంతం చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కన్నా పలు కీలక మంత్రి పదవులను అలంకరించారు. 2014లో గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తదుపరి కన్నా బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా నరసరావుపేట పార్లమెంట్‌కు 2019లో పోటీ చేసిన కన్నా ఓటమి పాలయ్యారు. 2023లో తెలుగుదేశం పార్టీలో చేరిన కన్నా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఏడోసారి 2024లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

● డాక్టర్ మాకినేని పెదరత్తయ్య తెలుగుదేశం ఆవిర్భావంతో రాజకీయాల్లోకి వచ్చారు. 1983లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి తొలిసారి పోటీచేసి గెలుపొందారు. ఆ తరుపరి జరిగిన నాలుగు ఎన్నికల్లో కూడా వెనుదిరిగి చూడలేదు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో విజయం సాధించిన రత్తయ్య జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో ఓటమి పాలయ్యారు. 2006లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ప్రత్తిపాడు నియోజకవర్గంను ఎస్సీ రిజర్వ్ చేశారు. దీంతో రత్తయ్య ప్రత్తిపాడు నుంచి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు.

● సంగం డెయిరీ ఛైర్మన్‌గా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కూడా పొన్నూరు నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. అయన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి కూడా ఇదే నియోజకవర్గంకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. కాగా వీరయ్య చౌదరి మరణంతో 1994లో జరిగిన ఎన్నికల్లో నరేంద్రకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం తెలుగుదేశం పార్టీ కల్పించింది. 1994, 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో వరుసగా ఐదుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన నరేంద్ర ఓటమిని చవిచూశారు. దీంతో అయనకు డబుల్ హ్యాట్రిక్ విజయం మిస్ అయింది. జరగనున్న ఎన్నికల్లో పొన్నూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా నరేంద్ర ఏడోసారి బరిలోకి దిగారు.



సమతాభావం కోసం చాపకూడు నిర్వహించిన ప్రాంతం నేడు కుల రాజకీయాలకు వేదికగా మారింది. మలిదేవరాజు పరిపాలించిన ఈగడ్డపై పలనాటి బ్రహ్మనాయుడు 12వ శతాబ్దంలో కుల వ్యవస్థను నిర్మూలించడానికి సహపంక్తి భోజనాలు నిర్వహించారు. అహింస మార్గాన్ని చూపిన జాతిపిత మహాత్మా గాంధీ నడయాడిన నేల ఇది. ఇందుకు భిన్నంగా నేటి రాజకీయాలు ఉన్నాయి. రాజకీయ పార్టీలు ఇక్కడ కుల రాజకీయాలనే నెరుపుతుంటాయి. పల్నాటి పౌరుషాల కత్తుల నెత్తుటి మరకల్లో తడిచి ఫ్యాక్షన్ రంగు పులుముకుని.. అభివృద్ధి ఆనవాళ్లను మరిచిన ప్రాంతమిది. ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆలవాలంగా మారింది. పల్నాటి పౌరుషానికి ప్రతీక.. ఎదురెదురుగా పోరాడే స్వభావం పల్నాటి పౌరుషం, కక్షలు, కార్పణ్యాలు మిళితమై అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయిస్తాయి. నక్సల్ ఉద్యమానికి కేంద్రంగా నిలిచింది. మావోయిస్టులు ఇక్కడ నుంచే దశాబ్దాల పాటు ఉద్యమాన్ని నిర్వహించారు. జీవ ప్రదాయినిగా పేరొందిన నాగార్జున సాగర్ జలాశయాన్ని గుండెలపై పెట్టుకున్నా.. గుక్కెడు నీళ్లకు అల్లాడుతున్న నియోజకవర్గం మాచర్ల. వరికపూడిశెల ఎత్తిపోతల పథకం ఎన్నికల హామీకే మిగిలిపోయింది. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆశీస్సులతో ఎందరో రాజకీయ నాయకులు తమ ఉనికిని చాటుకున్నారు.

పౌరుషాల పురిటి గడ్డ

- మలిదేవరాజు పాలించన నేల మాచర్ల
- కుల వ్యవస్థ నిర్మూలించేందుకు బ్రహ్మనాయుడు కృషి
- చాపకూడు సహపంక్తి భోజనాలు
- జాతిపిత మహాత్మా గాంధీ విదేశీవస్త్ర బహిష్కరణ ఉద్యమం
- ఆ తర్వాత ఫ్యాక్షన్ సంస్కృతి.. మవోయిస్టు ఉద్యమం
- సాగర్ చెంతనే.. తాగునీటి ఇక్కట్లు

సామాజికవర్గాల వారీగా ఓట్ల వివరాలు..

రెడ్డి	28,504
కమ్మ	22,620
కాపు	17,074
ముస్లీం	17,160
మాదిగ	31,241
మాల	9,198
యాదవ	22,100
వైశ్య	12,690
వడ్డెర	17,300
రజక	9,737
ముదిరాజు	9,089
ఎరుకల	4,637
బ్రాహ్మణ	1,055
సుగాలి	17,213
యనాది	2,400
గౌడ	3,736
కుమ్మరి	2,361
కంసాలి	2,299
ఇతరులు	25,659

మాచర్ల, ఏప్రిల్ 17: మాచర్ల 1962కు పూర్వం పల్నాడు నియోజకవర్గంలో భాగంగా ఉండేది. ఆ తరువాత ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సమస్యాత్మక గ్రామాలున్నాయి. దశాబ్దాల పాటు నక్సల్స్ ఆధిపత్యంలో ఉన్న ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్ రాజకీయాలు అధికం. ఇక్కడ జరిగే ఎన్నికలు పోలీసులకు సవాల్‌గా మారుతోంది. 2004 వరకు పోటీచేసి గెలిచిన ఏ ఒక్కరూ మరోమారు గెలవలేదు. నాలుగుసార్లు గెలుపొంది పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేశారు. ఆయన 2009, 2012, 2014, 2019 ఎన్నికల్లో విజయాలు సాధించారు. టీడీపీకి కార్యకర్తల బలమున్నా నాయకుల్లో అనైక్యత పిన్నెల్లి విజయానికి కారణమైంది. జూకంటి బ్రహ్మారెడ్డి తెలుగుదేశం పార్టీ బాధ్యతలు చేపట్టిన అనంతరం పార్టీలో ఐక్యత నెలకొల్పారు. రామకృష్ణారెడ్డి, జూలకంటి బ్రహ్మారెడ్డిలు 2004, 2009 ఎన్నికల్లో తలపడ్డారు. రెండుసార్లు పిన్నెల్లి విజయం సాధించారు. ఈ సారి గెలవడం ద్వారా తన సత్తా చాటేందుకు జూకలంటి సర్వశక్తులు వడ్డుతున్నారు. 1962లో ఈ నియోజకవర్గంను ఎస్టీ రిజర్వుడుకు కేటాయించారు. 2012లో ఉప ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం ఆవిర్భావం అనంతరం జరిగిన ఎన్నికల్లో నాలుగు సార్లు ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. 1983, 1989, 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. నియోజకవర్గ పునర్విభజన సమయంలో రెంటచింతల మండలంలోని మిట్టగుడిపాడు, మంచికల్లు, రెంటాల, రెంటచింతల గ్రామాలు గురజాల నియోజకవర్గం నుంచి మాచర్ల నియోజకవర్గంలోకి మారాయి.

నాణ్యమైన నాపరాయి

దేవళ్ళమ్మ చెరువు మాచర్ల పట్టణంలోని 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ చెరువు, 58 ఎకరాలలో విస్తరించి ఉంది. 1950 వరకు ఈ చెరువు కేవలం మంచినీటి చెరువుగానే ఉపయోగపడింది. సాగర్ కుడి కాలువలు నిర్మాణం జరుగక ముందు ఈ చెరువు పల్నాడులోనే ఒక పెద్ద త్రాగునీటి చెరువుగా గుర్తింపు పొందింది. సాగర్ కాలువ వచ్చిన తరువాత నిరాదరణకు గురై, ప్రస్తుతం ఆక్రమణల పాలై, క్రమేణా కుంచించుకు పోయింది. నాణ్యమైన నాపరాయికి క్వారీ లు ప్రసిద్ధి. ఇక్కడి నుంచి నాపరాయి ఇతర రాష్ట్రాలకూ, విదేశాలకూ ఎగుమతి అవుతుంది.

జాతిపిత నడియాడిన నేల..

జాతిపిత మహాత్మా గాంధీ పాదస్పర్శతో పులకించిన పల్నాట ఏకైక పల్లె రెంటచింతల. గాంధీ ఈ గ్రామములో 1929, ఏప్రిల్ 21న పర్యటించారు. విదేశీవస్త్ర బహిష్కరణ చేయాలని స్థానికులను కోరితే, వేలాదిమంది వస్త్రాలను నడివీధిలో వేసి, పెట్రోలుపోసి తగులబెట్టినారు. ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తాటాకు పందిరివేసినారు. ఇద్దరు ఉద్యమంలో భాగంగా, జాతిపిత సుమారు 500 రాట్నాలతో రోజంతా నూలు నేసిననఅరుదైన సన్నివేశం రెంటచింతల గ్రామస్థులకు ఒక తీపి గురుతుగా నిలిచిపోయింది.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1955	మందపాటి నాగిరెడ్డి	సీపీఐ	కురుముల రంగమ్మ	కాంగ్రెస్	2,271
1962(ఎస్టీరిజర్వ్)	మూడవత్ కేశవనాయక్	కాంగ్రెస్	మాదిగని దేవదత్తు	స్వతంత్ర	3,156
1967	వెన్నా లింగారెడ్డి	కాంగ్రెస్	జూలకంటి నాగిరెడ్డి	స్వతంత్ర	80
1972	జూలకంటి నాగిరెడ్డి	స్వతంత్ర	వెన్నా లింగారెడ్డి	కాంగ్రెస్	11,169
1978	చల్లా నారపరెడ్డి	కాంగ్రెస్ ఐ	కర్పూరపు కోటయ్య	జేపీ	5,392
1983	కొర్రపాటి సుబ్బారావు	టీడీపీ	చల్లా నారపరెడ్డి	కాంగ్రెస్	26,166
1985	నట్టువ కృష్ణమూర్తి	కాంగ్రెస్	వట్టికొండ జయరామయ్య	టీడీపీ	1,704
1989	నిమ్మగడ్డ శివరామకృష్ణప్రసాద్	టీడీపీ	నట్టువ కృష్ణమూర్తి	కాంగ్రెస్	4,777
1994	కుర్రి పున్నారెడ్డి	టీడీపీ	పిన్నెల్లి సుందరరామిరెడ్డి	కాంగ్రెస్	6,474
1999	జూలకంటి దుర్గాంబ	టీడీపీ	పిన్నెల్లి లక్ష్మారెడ్డి	కాంగ్రెస్	1,951
2004	పిన్నెల్లి లక్ష్మారెడ్డి	కాంగ్రెస్	జూలకంటి బ్రహ్మారెడ్డి	టీడీపీ	30,666
2009	పిన్నెల్లి రామకృష్ణారెడ్డి	కాంగ్రెస్	జూలకంటి బ్రహ్మారెడ్డి	టీడీపీ	9,785
2012(ఉపఎన్నిక)	పిన్నెల్లి రామకృష్ణారెడ్డి	వైసీపీ	చిరుమామిళ్ల మధుబాబు	టీడీపీ	15,479
2014	పిన్నెల్లి రామకృష్ణారెడ్డి	వైసీపీ	కొమ్మారెడ్డి చలమారెడ్డి	టీడీపీ	3,535
2019	పిన్నెల్లి రామకృష్ణారెడ్డి	వైసీపీ	అన్నపరెడ్డి అంజిరెడ్డి	టీడీపీ	21,918

చరిత్రకారుల కథనం..

క్రీశ 1182లో పలనాటి యుద్ధంగా పేరొందిన దాయాదుల పోరు మాచర్ల, గురజాల పట్టణాల మధ్య జరిగింది. ఈ యుద్ధం పల్నాటి హైహయ వంశంతో పాటు తీరాంధ్రలోని రాజవంశాలన్నింటినీ బలహీనపరచి కాకతీయ సామ్రాజ్య విస్తరణకు మార్గం సుగమం చేసింది. హైహయరాజుల కాలంలో ఈ ప్రాంతంలో గొప్పచెరువు వుండేదని, దానిమధ్యలో మహాదేవి ఆలయం వుండడం వలన ఈ ప్రాంతానికి మహాదేవిచర్ల అనే పేరు, వాడుకలో మాచర్లగా రూపాంతరం చెందిందని చరిత్రకారుల కథనం. తరువాతికాలంలో బ్రహ్మనాయుడు మలిదేవరాజుకి పల్నాటిరాజ్యంలో కొంతభాగమిప్పించి, గురజాల నుంచి విడిపోయి మాచర్ల రాజధానిగా పాలింపజేశాడు. మినీ మహాభారత యుద్ధంగా పిలవబడిన పల్నాటి యుద్ధం ఇక్కడే జరిగింది. అప్పటి వీరులు ఉపయోగించిన ఆయుధాలు ఇప్పటికీ ఇక్కడ పూజించబడడం విశేషం. చోళులు, జైనులు ఇక్కడ సంచరించి నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. బ్రహ్మనాయుడు మాచర్లలో పునర్ నిర్మించిన శ్రీలక్ష్మీ చెన్న కేశవస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందింది.



ప్రసిద్ధ ఆలయాలు..

ఎత్తిపోతల జలపాతం, నాగార్జునసాగర్ నుంచి మాచర్ల మార్గంలో 11 కిలోమీటర్ల దూరంలో తాళ్ళపల్లె వద్ద ఉంది. 70 అడుగుల ఎత్తున్న ఈ జలపాతం కృష్ణా నది ఉపనది అయిన చంద్రవంక నదిపై ఉంది. ఇక్కడ మొసళ్ళ పెంపక కేంద్రం ఉంది. యతి అను పేరుగల ఒక మహర్షి తపస్సు చేసిన స్థలం కనుక ఎత్తిపోతలగా ప్రసిద్ధి గాంచింది. ఈ ప్రదేశం సినిమాల ద్వారా అందరికీ సుపరిచితం. ఈ లోయలో వెలిసిన దత్తాత్రేయస్వామి సుగాలీయుల ఇలవేలుపు. ఏటా తొలి ఏకాదశినాడు జరిగే తిరునాళ్ళకు సమీప జిల్లాల్లోని సుగాలీలు అసంఖ్యాకంగా హాజరవుతారు. మధుమతీదేవి, రంగనాధస్వామి, చౌడేశ్వరీదేవి ఆలయాలు కూడా ఇక్కడున్నాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ ఆలయాలకు అత్యంత ప్రత్యేకత ఉంది. దేవాలయం మొత్తం, కొండను తొలిచి లోపల విగ్రహాన్ని ఏర్పాటుచేసారు. దుర్గిలోని శిల్పకళాకేంద్రాలు చేతివృత్తులవారి నైపుణ్యానికి అద్దం పడతాయి. రెంటచింతలలో దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఇక్కడి సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల పల్నాడులో విద్యావ్యాప్తికి దోహదపడింది. ప్రత్తి, మిరప, వరి ప్రధాన వాణిజ్యపంటలు.


మొత్తం ఓటర్లు	2,60,556
పురుషులు	1,27,751
మహిళలు	1,32,783
థర్డ్ జెండర్	22

మండలాల వారీగా ఓట్లు

మాచర్ల మునిసిపాల్టీ	46,294
మాచర్ల రూరల్	44,552
వెల్దుర్తి	41,132
దుర్గి	41,571
రెంటచింతల	40,320
కారంపూడి	46,687

దాయాదుల మధ్యే మళ్లీ పోటీ

ఈ ఎన్నికల్లో దాయాదులు తలపడుతున్నారు. టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డిల పోటీ పల్నాటి పోరును తలపిస్తోంది. 2004, 2009 ఎన్నికల్లో ఇరువురు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో పిన్నెల్లి గెలుపొందారు. మూడవసారి ఇరువురు ఢీకొంటున్నారు. ఇరువురి మధ్య పోటీ ఆశక్తికరంగా మారింది. జిల్లాలోని అందరి దృష్టి మాచర్ల ఎన్నికలపై పడింది. అధికారం అండతో పిన్నెల్లి అదికారం అండతో సాగించిన అరాచకాలు.. అక్రమాలు.. వేధింపులతో ప్రజలను భయకంపితులను చేశారని ఈ సారి ప్రజలు తనను గెలిపించి అయనకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధమయ్యారని జూలకంటి చెబుతున్నారు. ఫ్యాక్షన్‌తోనే ఇక్కడ పోలింగ్ జరగనుంది. పోలీసు యంత్రాంగానికి మాచర్ల ఎన్నిక సవాల్‌గా పరిణమించింది.


ఎత్తిపోతల జలపాతం

విశిష్టత..

మానవ నిర్మిత నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ సగభాగం నియోజకవర్గంలోకి వస్తుంది. మాచర్లలో కేసీపీ అతి ప్రాముఖ్యత ఉన్న సిమెంట్ కర్మాగారం. రెంటచింతల మండలంలో పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ. విద్యుదుత్పత్తి కోసం రెంటచింతలలో టెయిల్పాండ్ థర్మల్ విద్యుత్ కేంద్రం. నియోజకవర్గం రాష్ట్రానికి సరిహద్దుగా నిలిచింది. నాగార్జున సాగర్ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతోంది. నాగార్జునకొండ మ్యూజియంకు బౌద్ధ పండితుడు ఆచార్య నాగార్జున పేరు పెట్టారు. రాతియుగం నాటి పనిముట్లు, బుద్ధుడి కాలం నాటి ఆధ్యాత్మిక సంపద ఇక్కడ దొరుకు తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఐల్యాండ్ మ్యూజియం. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ సమీపంలోనే మినీ ఎయిర్పోర్టు ఉంది.

నేడు నారా లోకేశ్ నామినేషన్

- లోకేశ్ తరపున నామినేషన్ దాఖలు చేయనున్న ఉమ్మడి పార్టీల నేతలు
- తొలుత సీతారామస్వామి కోవెలలో ప్రత్యేక పూజలు
- భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించనున్న నేతలు

సమావేశంలో మాట్లాడుతున్న నందం అబద్దయ్య, చిల్లపల్లి శ్రీనివాసరావు



మంగళగిరి, మంగళగిరి సిటీ, ఏప్రిల్17: టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ తరపున మూడు పార్టీల నేతలు గురువారం ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు విలేకర్లకు వివరాలు వెల్లడించారు. అబద్దయ్య మాట్లాడుతూ తొలుత గురువారం ఉదయం పాతమంగళగిరి సీతారామస్వామి కోవెలలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా మిద్దె సెంటరు, వైష్ణవి కల్యాణ మండపం, పాతబస్టాండు మీదుగా ఎంటీఎంసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి లోకేశ్ తరపున కూటమి నేతలు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయిన అమరావతి రాజధాని రైతులు, నిరుద్యోగులు, చేనేత వర్గాల ప్రజలు, మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చి నామినేషన్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, ఆయా పార్టీ నేతలు జంజనం వెంకట సాంబశివరావు, శివనాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, షేక్ రియాజ్, అమరా సుబ్బారావు, వేమూరి షైనర్‌బాబు, గోవాడ దుర్గారావు, మల్లవరపు వెంకట్, దాసరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలోనూ కుప్పం సంప్రదాయమే!

కుప్పం సంప్రదాయమే ఇకపై మంగళగిరిలో కూడ అమలుచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్ణయించారు. మంగళగిరిని తన సొంత నియోజకవర్గంగా భావిస్తున్న లోకేశ్.. నామినేషన్ వేసే వ్యవహారంలోనూ తన తండ్రి చంద్రబాబునాయుడు బాటలోనే పయనించాలని తీర్మానించుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు తరపున స్థానిక పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే నామినేషన్ పత్రాలను దాఖలు చేయడం ఓ ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుంది. అదే సంప్రదాయాన్ని లోకేశ్ కూడ అనుసరించనున్నారు. మధ్యాహ్నం 2:34 నిమిషాలకు ఎంటీఎంసి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను కూటమి నాయకులు సమర్పిస్తారు. ఈ ఘట్టానికి తనతోపాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపి నియోజకవర్గ సమన్వయకర్త పంచుమర్తి ప్రసాద్ నేతృత్వం వహిస్తారని అబద్దయ్య తెలిపారు.

విద్యుత్ మీటర్లపై జగన్ చిత్రాలు

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన


రాజుపాలెంలోని ఓ రైతు పొలంలో సీఎం జగన్ చిత్రపటంతో ఉన్న విద్యుత్ మీటర్‌ను అమర్చిన దృశ్యం

రాజుపాలెం, ఏప్రిల్17: రాజుపాలెం గ్రామం పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్లకు గత మూడురోజుల నుంచి సీఎం జగన్ నవరత్నాలతో కూడిన చిత్రపటం ఉన్న విద్యుత్ మీటర్లను అమర్చుతున్నారు. ఈ విద్యుత్ మీటర్ మీద వైయస్ఆర్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అని రాసి ఉంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవటంపై టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఈసీ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు కూటమి అభ్యర్థుల నామినేషన్లు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 17: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం ఉదయం 10 గంటలకు నామినేషన్లు వేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ పట్టణంలో గుంటూరు రోడ్డులోని రంగావిగ్రహం వద్ద నుంచి మల్లమ్మ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేసి ఆశీస్సులు అందించాలని విజ్ఞప్తి చేశారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని మాట్లాడుతూ జనసేన పూర్తి సహాయ, సహకారాలు అంద జేస్తుందన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య పల్నాడు జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, లాం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ తదితరులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు టీడీపీ అభ్యర్థుల నామినేషన్

నరసరావుపేటలో భారీ ప్రదర్శన

నరసరావుపేట, ఏప్రిల్ 17: నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమవుతున్న తొలి రోజు గురువారం తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయనున్నారు. నరసరావుపేట లోక్‌సభ స్థానానికి కూటమి అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఆయన ఏర్పాట్లు చేసుకున్నారు. నామినేషన్ దాఖలు సందర్భంగా రావిపాడు రోడ్డులోని కాకతీయ నగర్ సెంటర్ నుంచి మల్లమ్మ సెంటర్ వరకు సమయంలో భారీ ప్రదర్శన జరగనుంది. పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి కూటమి అభిమానులు, నేతలు, కార్యకర్తలు తరలివచ్చేలా వాహనాలను ఏర్పాటుచేశారు. నరసరావుపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కూడా ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శనకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. ఇద్దరి ర్యాలీలు మల్లమ్మ సెంటర్‌లో కలసేలా ఏర్పాట్లు చేశారు. మల్లమ్మ సెంటర్‌లో అభ్యర్థులు ప్రసంగిస్తారు. వేలాది మంది నామినేషన్‌ల ప్రక్రియకు తరలిరానున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్, ఎస్పీ బింధుమాధవ్

రీపోలింగ్ రహిత ఎన్నికలకు కృషిచేయాలి

● అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ సూచన

నరసరావుపేట, ఏప్రిల్ 17: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు రీపోలింగ్ రహితంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషిచేయాలని ఎన్నికల యంత్రాంగం, పోలీసు సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణలో ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. 85 ఏళ్ల పైబడి ముందస్తుగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని వారికి 12డీ ఫారాలు అందించాలన్నారు. ఏడు అసెంబ్లీ, లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపు కేంద్రాలను నరసరావుపేట మండలంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 557 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. సీ విజిల్ యాప్ అమలులో జిల్లా ముందు వరుసలో ఉన్నదన్నారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ బిందు మాధవ్

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. రాజకీయ పార్టీలకు ఒకేసారి ఒకే రోజున ఒకే సమయంలో ఊరేగింపులకు అవకాశం లేదన్నారు. ఎన్నికల నియమాలు ప్రకారం నామినేషన్ దాఖలకు అభ్యర్థితో సహా ఐదుగురి మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధి వరకు గరిష్ఠంగా మూడు వాహనాలకు అనుమతి ఉందన్నారు. చెక్‌పోస్టల వద్ద తనిఖీలు పెంచాలని పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకం, ఏఎస్పీ రాఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్‌ల స్వీకరణ

లోక్ సభ స్థానానికి కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో అభ్యర్థుల నుంచి నామినేషన్‌లు స్వీకరిస్తారు. నరసరావుపేట అసెంబ్లీకి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలోని ఆర్వో ఆఫీసులో, సత్తెనపల్లి నియోజకవర్గానికి అక్కడి ఆర్డీవో కార్యాలయంలో, గురజాల నియోజకవర్గానికి గురజాల ఆర్డీవో కార్యాలయంలో, మాచర్ల నియోజకవర్గానికి అక్కడి తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్వో ఆఫీసులో, పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయంలో, వినుకొండ అక్కడి తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్వో కార్యాలయంలో నామినేషన్‌లు స్వీకరించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ మేరకు భారికేడ్లు ఏర్పాటుచేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌లు స్వీకరిస్తారు.

ఓట్ ఫర్ జీవీ అంటూ పట్టణంలో భారీ ర్యాలీ

● రా కదలిరా కార్యక్రమానికి కథం తొక్కిన యువత

వినుకొండ, ఏప్రిల్ 17: వినుకొండ అభివృద్ధికి మేము సైతం అంటూ రా కదలిరా అనే కార్యక్రమానికి వినుకొండలోని యువత నుంచి విశేష స్పందన లభించింది. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్ ఆధ్వర్యంలో కారంపూడిరోడ్డులోని విష్ణుకుండినగర్ నుంచి డిగ్రీ కాలేజి వరకు యువత పెద్దసంఖ్యలో ప్రత్యేకమైన తెలుపురంగు టీషర్టు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హరీష్ చేపట్టిన ర్యాలీలో నరసరావుపేట పార్లమెంటు కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కొణిజేటి నాగశ్రీనివాసరావులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు తదితరులు

టీడీపీలో చేరిన 32వ వార్డు వైసీపీ నేతలు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 17: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధ్వర్యంలో 32వ వార్డుకు చెందిన నేతలు వజీర్, నజీర్‌లు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీలో కీలకంగా వ్యవహరించిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పసుపు కండువా కప్పి టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అప్రజాస్వామిక పనితీరుతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారంటూ కార్యకర్తలు ఆసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి వెంకటనరసయ్య, బులియన్ గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 17: మండలంలోని కొప్పుకొండలో ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి మెడలో గొలుసు దోచుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన దేవరకొండ పిచ్చిమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆమె మెడలో నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. తెల్లవారి గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్తే స్పందన లేకపోవడంతో బుధవారం వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ల చోరీ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 17: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంట పొలాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడడం పరిపాటిగా మారింది. మండలంలోని పెదకంచర్ల గోనుగుంట్లవారిపాలెం, రావిచెట్టు గ్రామాల పంట పొలాల్లో సుమారు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లలను తొలగించి కాపర్‌వైర్‌ను బుధవారం దొంగిలించారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వరుస దొంగతనాలపై విద్యుత్‌శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తురుమెళ్ళలో ఎస్ఐ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పర్యటన

రొంపిచర్ల, ఏప్రిల్ 17: మండలంలోని తురుమెళ్ళ గ్రామంలో ఎస్ఐ రవీంద్ర, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం బుధవారం పర్యటించింది. ఎన్నికల నేపథ్యంలో గ్రామంలోని విగ్రహాలకు ఏర్పాటుచేసిన ముసుగులను తొలగిస్తున్నారని ఫిర్యాదు రావటంతో అక్కడికి వెళ్ళి వాటికి ముసుగులు వేయించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శిలాఫలకాలపై, విగ్రహాలపై ముసుగులు తొలగించవద్దని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తులను గుర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా వీరవట్నం చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు.

ఇండియా కూటమిని గెలిపించండి: విజయకుమార్

రొంపిచర్ల, ఏప్రిల్ 17 : విభజన హామీలు, రాజధాని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ బుధవారం పేర్కొన్నారు. మండలంలోని సంతగుడిపాడులో రొంపిచర్ల మండల సభ్యుల సమావేశం జరిగింది. సరికొండ వెంకటేశ్వర రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కామినేని రామారావు, బండారుపల్లి నాగేశ్వరరావు, బొట్లూరు అంజిరెడ్డి, పాపారావు, యాకోబు, సుబ్బారావు, ఖాదర్, మస్తాన్, రామిరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సీనియర్ నేత ప్రసాద్ టీడీపీలో చేరిక



అనుముల ప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపి కృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, ఏప్రిల్ 17: పట్టణంలో రాజకీయ చరిత్ర కల్గిన అనుముల ప్రసాద్ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అధికార వైసీపీని వీడి సుమారు 100 మంది తన అనుయాయులతో కలిసి నర్సరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయులు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు శావల్యాపురం మండలంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అనుముల ప్రసాద్ మాట్లడుతూ అధికార వైసీపీలో పార్టీ విజయం కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు లేకపోవడంతో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం లావు కృష్ణదేవరాయులతోపాటు జీవీ, మక్కెన, అనుముల కలిసి మరికొంత మంది పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లడుతూ జీవీ ఆంజనేయులుపై నమ్మకంతో ఎంతో మంది వినుకొండ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు.

త్వరలో శ్రీరామరాజ్యం సాకారం: హరీష్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 17: త్వరలో రాష్ట్రంలో శ్రీరామరాజ్యం సాకారం కాబోతున్నాయని జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్ అన్నారు. బుధవారం వినుకొండ పట్టణంలోని విష్ణుకుండినగర్, మెయిన్ బజారు బోసు బొమ్మ సెంటర్‌తోపాటు పలు ఆలయల్లో ఏర్పాటుచేసిన ముత్యాల పందిళ్లను సందర్శించి రాములవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరీష్ మాట్లడుతూ చంద్రబాబు సారథ్యంలో జరగబోయే రామరాజ్యం కోసం ప్రజలందరితోపాటు తాను ఎదురుచూస్తున్నానని అన్నారు.

బొల్లా అవినీతి దాహనికి ఎంతో మంది బలి : జీవీ

వినుకొండ, ఏప్రిల్ 17: వినుకొండ నియోజకవర్గంలోఎమ్మెల్యే బొల్లా అవినీతి దాహనికి ఎంతోమంది బలయ్యారని, అక్రమాలు భూకబ్జాలు బీట్యాక్స్ వసూళ్ల మీద పెట్టిన శ్రద్ధ పేదల సంక్షేమంపై బొల్లా దృష్టి పెట్టలేదని జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చాశారు. మండలంలోని నడిగడ్డ గ్రామంలో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతోపాటు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీనుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీలో చేరిన 30 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

దళిత ద్రోహులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశ్రయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 17: జగన్‌మోహన్‌రెడ్డి దళితులను అవమానించిన వారికి ఆశ్రయం ఇస్తున్నారని, వైసీపీ దళిత ద్రోహులపార్టీ అని రుజువు అయిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మండపేట నుంచి తోట త్రిమూర్తులు అనే వ్యక్తికి ఆశ్రయం ఇచ్చిందని, ప్రస్తుతం ఆయనను కోర్టు దోషిగా తేల్చిందన్నారు. దళిత వ్యతిరేక నాయకులకు జగన్‌పార్టీ బహిరంగంగా ఆశ్రయం కల్పిస్తుందని, 1996లో జరిగిన శిరోమండనం కేసులో విశాఖపట్నం కోర్టు వెలువరించిన తీర్పులో వైసీపీ నాయకుడు తోట త్రిమూర్తులకు శిక్ష విధించిందన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ప్రతి వేదికపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని ప్రేమ వలకబోస్తున్నారని ఎద్దేవా చేశారు. నాడు దళితుడిని చంపిన అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసి మళ్ళీ పార్టీలోకి తెచ్చుకున్నాడని, జగన్‌మోహన్‌రెడ్డి నడుపుతున్న ప్రభుత్వంలోనే దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయని, ఎస్సీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. డాక్టర్ సుధాకర్ నుంచి దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతోమంది దళితబిడ్డలు బలయ్యారన్నారు. ఇప్పుడు ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్ల అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యామ్‌కుమార్‌ను శాడిస్టులు నిర్బధించి నాలుగు గంటలపాటు చిత్రహింసలు పెట్టారన్నారు. దాహంవేసి మంచినీళ్లు అడిగితే సభ్యసమాజం తలదించుకోనేలా మూత్రంపోసి అవమానించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఏమాత్రం మనస్సాక్షి ఉన్నా ఈ అమానవీయ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

బాధిత దళితులకు న్యాయం చేసేందుకు ఏర్పాటైన చట్టబద్ధ సంస్థకు అధిపతి అయిన ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్‌బాబు ఈ ప్రభుత్వంలో నేనే బాధితుడి అంటూ వాపోయారన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 6035 మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం దళితులపై దాడులు జరుగుతున్న రాష్ట్రాలలో ఏపీ 7వ స్థానంలో ఉందన్నారు. 2021లో 208మంది ఎస్సీ మహిళలు, చిన్నారులపై దాడులు జరిగాయని, 33మంది దళితులు హత్యకు గురయ్యారన్నారు. నంద్యాల జిల్లా మునగాల సుంకులమ్మ ఆలయంలోకి వెళ్ళకుండా అవమానించి, అడ్డుకున్నారని మల్లెపోగు నరహరి అనే దళిత యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ జంబులయ్య, మరికొందరు కాలితో తన్ని ఆలయంలోకి వస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారన్నారు. దళిత అంగన్‌వాడీ కార్యకర్తను శారీరకంగా, మాటలతో వేధించిన కొత్తపల్లి ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ర్యాలీ చేపట్టినా ప్రయోజనం లేపోయిందన్నారు.

కేజీబీవీ మోడల్ స్కూళ్ళు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్ కాలేజీలలో విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా మారిందన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు సరఫరా చేయడం లేదన్నారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

రొంపిచర్ల, ఏప్రిల్ 17: మండలంలోని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల వద్ద పందిళ్లను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. రొంపిచర్లలోని బ్రహ్మంగారి దేవస్థానం, బొడ్డురాయి సెంటర్‌ల వద్ద వడపప్పు, పానకం పంపిణీ చేశారు.



కర్లకుంటలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

● యడ్లపాడు, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాలలో సీతారాముల కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు.యడ్లపాడు సీతారామచంద్ర స్వామి, ప్రపత్తి ఆంజనేయస్వామి ఆలయాలలో, జగ్గాపురంలోని పరివార పట్టాభి సీతారామస్వామి ఆలయం, లింగారావుపాలెం, మైదవోలు, కారుచోల, గుత్తావారిపాలెం, కొత్తపాలెం, బోయపాలెం గ్రామాలలోని రామాలయాలతో పాటు తిమ్మాపురం, బోయపాలెం, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాలలో కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కాగా గుత్తావారిపాలెం గ్రామంలోని కోదండరామస్వామి దేవస్థానంలో జరిగిన కల్యాణ వేడుకలలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కళ్యాణం నిర్వహించారు. ఎండుగుంపాలెం గ్రామంలోని అక్కాయకుంట వద్ద గల సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. పుల్లారావుతో పాటు జీడీసీసీబీ మాజీ ఛైర్మన్ మానం వెంకటేశ్వర్లు, జనసేన నేత తోట రాజా రమేష్, బీజేపీ నేత పోట్రు పూర్ణచంద్రరావు, పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, మదన్‌లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

● శావల్యాపురం: శ్రీరామనవమి పర్వదిన వేడుకలను మండలంలోని వేల్పూరు, పోట్లూరు, శావల్యాపురం, బొందిలిపాలెం, మతుకుమల్లి, కారుమంచి తదితర గ్రామాలలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధుల్లో ఊరేగించి వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్ల, వీ అప్పాపురం, రవ్వవరం, మృత్యుంజాపురం, ఐనవోలు, ఉప్పలపాడు, ములకలూరు తదితర గ్రామాల్లో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

● ఈపూరు: శ్రీరామ నవమి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం సీతారాముల కళ్యాణాన్ని కన్నులపండుగగా జరిపించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు.



టీడీపీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

కూటమి ప్రభంజనానికి సర్వేలే సాక్ష్యం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 17: రాష్ట్రంలో రాబోతున్న కూటమి ప్రభంజనానికి లెక్కకు మిక్కిలిగా వస్తున్న సర్వేల ఫలితాలే సాక్ష్యమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జాతీయ మీడియా సంస్థలు నిర్వహిస్తున్న ఏ ముందస్తు సర్వేను తీసుకున్నా 18 నుంచి 20 ఎంపీ సీట్లు తెలుగుదేశం కూటమి గెలవబోతున్నదని చెబుతున్నారని తెలిపారు కొంత కాలంగా రాష్ట్ర వ్యాప్తంగా అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు ఇటీవల మరింత పెరగటానికి ఇది ఒక కారణం అన్నారు. బుధవారం పట్టణంలోని 38వ వార్డుకు చెందిన వైసీపీ ఎనిమిది కుటుంబాలు, 19 వార్డుకు చెందిన వైసీపీ నాయకురాలు తాటిమళ్ళ కృష్ణవేణి టీడీపీలో చేరారు.

సూపర్ - 6 పథకాలతో సంక్షేమం, అభివృద్ధి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 17: తాము అందించబోతున్న సూపర్-6 పథకాలతో ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి ఫుల్‌గ్యారెంటీ లభించబోతున్నదని మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం పట్టణంలోని 36, 37 వార్డుల్లో ఎన్నికల శంఖారావం, సూపర్ - 6 పథకాలపై ఆయన ప్రచారం నిర్వహించారు.

నాదెండ్ల మండలంలో ప్రచారం

నాదెండ్ల, ఏప్రిల్ 17: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని గణపవరం, సాతులూరు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు కోరారు. సాతులూరులో ముస్లిం మైనార్టీల నాయకులతో ఆ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించి భవిష్యత్‌లో మైనార్టీల కోసం టీడీపీ చేపట్టనున్న పథకాలను వివరించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, అధ్యక్షులు బీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ హిమవంతరావు, నాయకులు వసంతరావు, శ్రీనివాసరావు, హరిబాబు, మున్నంగి శ్రీను, కే అచ్చయ్య జంపని శ్రీను తదితరుల పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 17: మండలంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం 63 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బీ నయనతార బుధవారం తెలిపారు. సాధారణ తనిఖీ నిర్వహిస్తుండగా మండలంలోని ఉప్పలపాడులో బ్రహ్మంగారి దేవాలయం వద్ద అదే గ్రామానికి చెందిన దారా నాగరాజు 15సీసాల మద్యాన్ని కలిగి ఉండగా గమనించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి ఓ మోటారు సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పమిడిపాడు అగ్రహారం గ్రామానికి చెందిన కంచేటి వెంకటేశ్వర్లు 48 మద్యం సీసాలను కలిగి ఉండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇరువురు నిందితుల వద్ద నుంచి 63 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

సాగర్ జలాలు చేపల చెరువులకు మళ్లింపు

శావల్యాపురం, ఏప్రిల్ 17: తాగునీటి చెరువులను నింపుకొనేందుకు ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేస్తే కొందరు చేపల చెరువుల యజమానులు చేపల చెరువులు నింపుకొన్నారు. తాగునీటి కోసం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ప్రభుత్వం విడుదల చేసిన సాగర్ జలాలు మంగళవారం మండలానికి చేరాయి. శావల్యాపురం తాగునీటి పథకానికి నీరొచ్చే మేజర్‌కు సోమవారం రాత్రి పోట్లూరుకు చెందిన చేపల చెరువు యజమానులు వారి పొలాల వద్ద గండి కొట్టి నీటిని వారి చెరువులకు మలుపుకొన్నారు. నీరు రాకపోవడంతో పంచాయతీ సిబ్బంది పరిశీలించగా గండికొట్టి ఉండడాన్ని గమనించారు. దీనిపై ఎంపీడీవో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు బుధవారం ఉదయాన్నే గండి కొట్టిన ప్రదేశాన్ని పరిశీలించి వెంటనే పూడ్చించి శావల్యాపురం చెరువుకు తాగునీరు చేరేలా చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎన్నెస్పీ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

మే 1 నుంచి వేసవి శిక్షణ తరగతులు

యడ్లపాడు, ఏప్రిల్ 17: యడ్లపాడు అభివృద్ధి కమిటీ (విద్యావిభాగం) ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులను మే 1వ తేదీ నుంచి నెల రోజులపాటు నిర్వహిస్తున్నట్లు అభివృద్ధి కమిటీ సభ్యుడు కల్లూరి వాసు తెలిపారు. శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని సభ్యులు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ స్థానిక నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఉదయం 7.30గంటల నుంచి 11.30గంటల వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9492615112, 9908399169ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల, ఏప్రిల్ 17: మండలంలోని రొంపిచర్ల పడమటిపాలెంలో పాటిమీద ఆంజనేయ స్వామి, వడ్లమూడివారిపాలెం గ్రామంలోని ఆంజనేయస్వామి తిరునాళ్ళ మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వార్లకు పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివార్లను భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చిన్నారులు మొక్కుబడి ప్రభలను నిర్మించారు.